# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 20-10-2025 సమయం : రాత్రి 8 గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

❖ ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత త్రివిధ దళాలు చక్కని సమన్వయంతో పని చేశాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసించారు.

❖ దీపావళి పండుగను దేశవ్యాప్తంగా ప్రజలు ఈరోజు ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారు.

❖ ఉగ్రవాదం, మావోయిస్టులకు భారత్‌లో చోటు లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.

❖ అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం రానున్న 24 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వెల్లడించింది.

=======================

ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత త్రివిధ దళాలు చక్కని సమన్వయంతో పని చేశాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. గోవాలోని కార్వార్ తీరంలోని INS విక్రాంత్‌లో నావికాదళ సిబ్బందితో కలిసి ఈరోజు ప్రధానమంత్రి దీపావళి వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మూడు దళాల అసాధారణ సమన్వయం పాకిస్తాన్ ను లొంగిపోయేలా చేసిందన్నారు. దేశపు మొట్టమొదటి స్వదేశీ విమాన వాహక నౌక INS విక్రాంత్, భారత సాయుధ దళాల సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తుందన్న ప్రధానమంత్రి, ఇది కేవలం యుద్ధనౌక మాత్రమే కాదని, 21వ శతాబ్దపు భారతదేశ చాతుర్యం, సంకల్పాలకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. INS విక్రాంత్ ఆత్మనిర్భర్ భారత్, ఇంకా మేడ్ ఇన్ ఇండియాకు ఒక మహోన్నత చిహ్నమని నరేంద్ర మోదీ పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

నావికాదళ సిబ్బందిని ఉద్దేశించి ప్రధానమంత్రి మాట్లాడుతూ... వారితో కలిసి పవిత్రమైన దీపావళి పండుగను జరుపుకోవడం తన అదృష్టమన్నారు. తనకు ఒక వైపు సముద్రం, మరోవైపు సైనికుల బలం ఉందని, ఈ రోజు అద్భుతమైన రోజు అని చెప్పారు. సముద్ర జలాలపై సూర్యకిరణాల ప్రకాశం.. సైనికులు వెలిగించే దీపాల వంటిదిగా అభివర్ణించారు.

=======================

దీపావళి పర్వదినాన్ని దేశవ్యాప్తంగా ప్రజలు ఈరోజు ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే ఈ పండుగను పురస్కరించుకొని ప్రజలు ఇళ్ళలోను అలాగే దేవాలయాల్లోను దీపాలను వెలిగించి జరుపుకోవడం ఈ పండుగ ప్రత్యేకత. దీపావళి పండుగ సందర్భంగా లక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం పరిపాటి. దీపావళి సందర్భంగా దేశంలోని నగరాలు, పట్టణాలు, పల్లెల్లో వీధులను, ప్రధాన రహదారులను రంగురంగుల దీపాలతోను, పువ్వులతోను అలంకరించారు. సాయంత్రం నుండి ప్రజలు తమ ఇళ్ళ వద్ద, వీధుల్లోను బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.

=======================

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నాలుగు రోజుల కేరళ పర్యటన నిమిత్తం రేపు తిరువనంతపురం చేరుకుంటారు. పర్యటనలో భాగంగా రాష్ట్రపతి ఈ నెల 22వ తేదీన శబరిమల ఆలయాన్ని సందర్శించనున్నారు. 23న తిరువనంతపురంలోని రాజ్ భవన్‌లో పూర్వ రాష్ట్రపతి కె. ఆర్. నారాయణన్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. శ్రీ నారాయణ గురు సమాధి శతాబ్ది ఉత్సవాలకు కూడా రాష్ట్రపతి హాజరుకానున్నారు. అలాగే.. పాలాలోని సెయింట్ థామస్ కళాశాలలోను, ఎర్నాకులంలోని సెయింట్ థెరిసా కళాశాలలోను జరిగే కార్యక్రమాల్లో ద్రౌపది ముర్ము పాల్గొంటారు.

=======================

రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ ఈరోజు న్యూఢిల్లీలోని రైల్వే బోర్డు వార్ రూమ్‌ను సందర్శించారు. పండుగ సీజన్‌లో ప్రయాణీకుల గమనం, రద్దీ వివరాలను ఆయన పరిశీలించారు. రైల్వే సిబ్బంది మనోధైర్యంతో 24 గంటలు పని చేస్తారని కొనియాడుతూ.. దీపావళి పండుగ సందర్భంగా వారికి శుభాకాంక్షలను తెలియజేశారు. కాగా.. ప్రస్తుత పండుగ సీజన్‌లో ప్రయాణీకుల అవసరాలను తీర్చేందుకు భారతీయ రైల్వే విస్తృతమైన ఏర్పాట్లు చేసింది. లక్ష్మీపూజ, దీపావళి, ఛట్ పూజల సమయంలో ప్రజలు సజావుగా ప్రయాణించడానికి 12 వేలకు పైగా ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. రాబోయే రోజుల్లో మరో 8 వేల ప్రత్యేక రైళ్లను నడపాలని భారతీయ రైల్వే యోచిస్తోంది.

విరామం

=======================

ఉగ్రవాదం, మావోయిస్టులకు భారత్‌లో చోటు లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. గోవా సముద్రతీరంలో నౌకాదళ సిబ్బందితో కలిసి ఆయన దీపావళి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మావోయిస్టులు.. అభివృద్ధి నిరోధకులుగా మారారని, వారి ఏరిపేతకే ఆపరేషన్ కగార్ చేపట్టామని అన్నారు. భారత్‌ను మావోయిస్టు రహిత దేశంగా తీర్చిదిద్దే దిశగా ఎన్డీయే ప్రభుత్వం ముందుకెళ్తోందని చెప్పారు. 11 సంవత్సరాలకు ముందు మావోయిస్టులు 125 జిల్లాల్లో విస్తరించి ఉండేవారని, ప్రస్తుతం 3 జిల్లాలకే పరిమితమయ్యారని తెలిపారు. మావోయిస్టుల ప్రభావం నుండి విముక్తి పొందిన 100కి పైగా జిల్లాల ప్రజలు ఈరోజు ఆనందంగా దీపావళి వేడుకలు చేసుకుంటున్నారని ప్రధానమంత్రి పేర్కొంటూ..

(వాయిస్ 40 సెకన్లు)

=======================

రైతులు, నిరుపేదలు, యువత, మహిళల సంక్షేమానికి, సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని హర్యానా రాష్ట్ర ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీ అన్నారు. హర్యానాలోని అన్ని పంటలను కనీస మద్దతు ధర (MSP) కు కొనుగోలు చేస్తున్నట్టు ఈరోజు పేర్కొన్నారు. చెరుకు ధరను క్వింటాలుకు 15 రూపాయలు పెంచుతున్నట్లు ప్రకటించారు. తొలి దశలో పండించే చెరకు రకాల ధరను క్వింటాలుకు 400 నుండి 415 రూపాయలకు, చివరి రకాల ధరను క్వింటాలుకు 393 నుండి 408 రూపాయలకు పెంచినట్టు పేర్కొన్నారు. గత 11 పంట సీజన్లలో, లక్షా 54 వేల కోట్ల రూపాయలను 12 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాలకు నేరుగా బదిలీ చేశామని నయాబ్ సింగ్ సైనీ తెలియజేశారు.

========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 127వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 24వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

========================

ఆగ్నేయ అరేబియా సముద్రంలో ఈరోజు ఉదయం అల్పపీడనం ఏర్పడిందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) అధికారులు తెలిపారు. ఈ అల్పపీడనం పశ్చిమ దిశగా కదులుతూ, రానున్న 24 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాగే రానున్న 24 గంటల్లో ఆగ్నేయ బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని తెలియజేశారు. ఇది పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ, వచ్చే 48 గంటల్లో దక్షిణ బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న పశ్చిమ-మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారి మరింత బలపడే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్త ఎస్. బాలకృష్ణన్ తెలియజేస్తూ…

(వాయిస్ 30 సెకన్లు)

========================

బీహార్‌లో రెండో దశ అసెంబ్లీ ఎన్నికలకు నామినేషన్ల దాఖలకు గడువు నేటితో ముగిసింది. మొత్తం 243 స్థానాలకు గాను, రెండవ దశలో 20 జిల్లాల్లో విస్తరించి ఉన్న 122 నియోజకవర్గాలకు నవంబర్ 11న ఎన్నికలు జరుగుతాయి. అసెంబ్లీ ఎన్నికల మొదటి దశకు నామినేషన్ల ఉపసంహరణకు కూడా నేడు చివరి తేదీ.

========================

========================